



# ఘనంగా సద్దుల బతుకమ్మ





శెనార్తి మీడియా, కొత్తపల్లి :

కొత్తపల్లి మండలం ఆసిఫ్ నగర్ (బావుపేట), ఖాజీపూర్ లో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. బావుపేట, ఖాజీపూర్ లో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. మహిళలు, యువతులు కొత్త బట్టలు ధరించి బతుకమ్మలను రంగురంగుల పూలతో పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. ఆసిఫ్ నగర్, ఖాజీపూర్ గ్రామాల ఆడపడుచులకు మెట్టినింట్లో ఏడు రోజులకు, పుట్టినింట్లో తొమ్మిది రోజులకు రెండుసార్లు సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకునే అవకాశం వస్తుంది. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత– మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు తదితరులు పాల్గొన్నారు.





## మందుబాబులకు అడ్డాగా పల్లె దవఖాన

శెనార్తి మీడియా, శంకరపట్నం :

శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామంలోని పల్లె దవఖాన మందుబాబులకు అడ్డాగా మారింది. పరిశుభ్రతలో నిర్లక్ష్యం చోటుచేసుకుంది. హస్పిటల్ ప్రాంగణంలో నీరు, గడ్డి, చెత్త పేరుకుపోవడంతో పాటు బీరు బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆవరణ అంతా పడేసి ఉన్నాయి. గ్రామానికి దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.వైద్యాధికారులు, ఏఎన్ఎంలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్పిటల్ వద్ద నీరు నిల్వ ఉండటంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి




చెందే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, జిల్లా వైద్యాధికారులుఈ పల్లె దవాఖానపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై మండల వైద్యాధికారి శ్రవణ్ కుమార్ ను వివరణ కోరగా వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. రాత్రి వేళలో తమ సిబ్బంది సబ్ సెంటర్ లో ఉండరని పేర్కొన్నారు. దేవాలయం లాంటి హాస్పిటల్ లో మందు బాబులు మద్యం తాగుతుంటే గ్రామస్తులు కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని, హాస్పిటల్ ను కాపాడుకోవాల్సిన బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలి. సబ్ సెంటర్ లో మద్యం తాగేది దాదాపు అక్కడి వార్రై ఉంటారే తప్ప బయటి వ్యక్తులు రారు. గ్రామస్తులు కూడా హాస్పిటల్ ను కాపాడుకోవాలి



## కలెక్టర్ ను సన్మానించిన టీఎన్జీవోస్ కమిటీ



**శెనార్తి మీడియా,ఆదిలాబాద్:** నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు.జిల్లాలో భూగర్భ జలాల వృద్ధికి కృషిచేసినందుకు 'జల్ సంచయ్.. జన్ భగీదారీ' పథకంలో భాగంగా జాతీయస్థాయి అవార్డు కలెకర్ దక్కింది.ఈ మేరకు శనివారం కలెక్టర్ ను టీఎన్జీవోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్,ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం కదం తొక్కిన రైతులు

- **కుచులాపూర్ అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకో**

శెనార్తి మీడియా, తలమడుగు :




రైతులకు సరిపడ యూరియా బస్తాలు అందించక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కుచులాపూర్ రైతులు శనివారం అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గ్రామం నుండి అంతరాష్ట్ర రహదారి వరకు ఎడ్ల బండ్లతో ర్యాలీగా వచ్చి రోడ్డుపై బైఠాయించారు. రాస్తారోకోకు బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో అప్పుల ఊబిలోకి కురుకుపోయామన్నారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయామన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తానని చెప్పి ఇప్పటి వరకు అదుకోలేదన్నారు. రైతులకు సరిపడ యూరియా అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలు మార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా అందించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతు లకు గోసగా మారిందన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నినాదాలు చేశారు. సంఘటన స్థలానికి ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్, ఎస్సై రాధిక చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు

## బీసీ రిజర్వేషన్ల అమలుపై హర్షం..



శెనార్తి మీడియా,ఆదిలాబాద్:

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత నివాసంలో నేతలు సంబరాలు జరిపారు.సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి

- **సీఎం రేవంత్ ఫ్లెక్సీకి పాలాభిషేకం..**

పాలాభిషేకం చేసి నినాదాలతో హోరెత్తించారు.అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు.ఈ సందర్భంగా గండ్రత్ సుజాత మాట్లాడుతూ.. బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిందని అన్నారు.ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిందని పేర్కొన్నారు. అన్ని వర్గాలు అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నేతలు అల్లూరి సంజీవ్ రెడ్డి,అంబకంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.